క్లుప్తంగా

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


పురుగు మందుల స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: ఎరువుల దుకాణదారులు పురుగుల మందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏఓ వరలక్ష్మి సూచించారు. ఆమె గురువారం మండల కేంద్రంలోని గుప్తా పురుగు మందు దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విక్రయిదారుని లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్, పురుగు మందుల నిల్వలను, నిల్వ ఉన్న స్టాక్ తనిఖీ చేశారు. ఏఓ మాట్లాడుతూ అనుమతులు లేని పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్టాక్ బోర్డును ప్రతి రోజు విధిగా అప్‌డేట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ద్రాక్షాయణి, వీహెచ్‌ఏ మురళీకృష్ణ పాల్గొన్నారు.

రాయితీపై పశు దాణా పంపిణీ


పాడి రైతులకు దాణాను పంపిణీ చేస్తున్న అధికారులు

గుడిపాల: పాడి రైతులకు ప్రభుత్వం 50శాతం రాయితీపై పశుదాణాను అందజేస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం పశువైద్యాధికారి రవితేజ తెలిపారు. పానాటూరు రైతుసేవా కేంద్రంలో గురువారం ఆయన పశుదాణాను అందజేశారు. ఆయన మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు గల పాడి రైతుకు ఈ దాణాను అందజేస్తున్నట్లు తెలిపారు. పాడి రైతు ముందుగానే నగదును చెల్లించినట్లయితే ఆ తరువాత 10 రోజుల్లో దాణాను అందజేయనున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు పశువైద్య సిబ్బంది కిషోర్, చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

27 మందికి వైద్య పరీక్షలు


దిగువ మోదలపల్లెలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: మండలంలోని దిగువ మోదలపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ 27 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు సకాలంలో పరీక్షలు చేయించుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమం అని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. తద్వారా దోమలను లార్వా దశలోనే నశింపచేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలకు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవి లేవు.. అన్నీ కోతలే!

- గత ప్రభుత్వంలో గంటలో రేషన్ కార్డు
- కార్డులివ్వని కూటమి సర్కార్
- పింఛన్ల కోతలో మాత్రం దూకుడు


పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్లు (ఫైల్)

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించింది. సంక్షేమ పథకాలను ప్రజల గడపవద్దకు చేర్చింది. కేవలం గంటల వ్యవధిలో రేషన్‌కార్డులు అందజేసిన ఘనత జగనన్న ప్రభుత్వం దక్కించుకుంది. కొత్త పింఛన్ల మంజూరును సకాలంలో చేపట్టింది. అయితే ప్రస్తుత కూటమి సర్కారు గద్దెనెక్కి ఏడాదైనా కొత్త రేషన్ కార్డుల జాడే లేదు. కొత్త పింఛన్లు ఇంతవరకు మంజూరు చేయలేదు. దీంతో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గంలోని ప్రజల కష్టాలు వర్ణనాతీతం.

కాణిపాకం: పరిపాలనను ప్రజలకు చేరువ చేసే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన వ్యవస్థలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా తొలగిస్తోంది. కరోనా, వరదలు వంటి విపత్తు సమయాల్లో సైతం సంక్షేమం పథకాలు అందించిన ఘనత జగనన్నదే. ప్రజల మన్ననలు పొందిన వలంటీర్ వ్యవస్థను ఒక్క కలం పోటుతో చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేసింది. ఇదే మాదిరిగానే రేషన్, కార్డులు, పింఛన్ల మంజూరుపై కోతలు పెడుతూనే ఉంది.

కూటమి వచ్చే.. కష్టాలు తెచ్చే..

ఎన్నికల్లో గెలిచేందుకు చంద్రబాబు అలవి కాని హామీలు గుప్పించారు. ఇందులో భాగంగానే తాము అధికారంలోకి వస్తే సామాజిక భద్రత పింఛన్లు రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ఇప్పటికే సూపర్–6 అంటూ ఊరూవాడా ఊదరగొట్టిన పథకాలను అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలు చేయడం లేదు. అసెంబ్లీ సాక్షిగా సూపర్–6 అంటే భయం వేస్తోందంటూ చంద్రబాబు ప్రకటించడంతో జనం విస్తుపోయారు. పలుమార్లు ఆర్థిక పరిస్థితి బాగోలేదు.. ఖజానా ఖాళీ.. ప్రజలు కూడా అర్థం చేసుకోవాలి.. అంటూ ముఖ్యమంత్రి తనదైన శైలిలో సన్నాయి నొక్కులు ఆరంభించారు. క్రమంగా ఒక్కో హామీని రకరకాల సాకులతో పక్కన పెట్టేస్తున్నారు. ఈ క్రమంలోనే రకరకాల కారణాలతో సామాజిక భద్రతా పింఛన్లకు కూడా నెమ్మదిగా ఎసరు పెడుతున్నారు. పింఛన్ల పెంపు ఆర్థికంగా భారమవుతోందని భావిస్తున్న ప్రభుత్వం క్రమంగా లబ్ధిదారుల సంఖ్యలో కోత పెడుతోంది.

ప్రజానుకూల విధానాన్ని తుంగలో తొక్కి..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కులం, మతం, వర్గం, రాజకీయ పార్టీ అనేది చూడకుండా.. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ పూర్తి పారదర్శకంగా పింఛన్లు పంపిణీ చేసేవారు. తెల్లవారకుండానే తలుపుతట్టి మరీ వలంటీర్ల ద్వారా పింఛన్ లబ్ధిదారుల చేతికి అందించే వారు. రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా జరిగిన ఈ తంతును కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తిగా తుంగలో తొక్కేసింది. నేడు తెలుగు తమ్ముళ్ల ప్రమేయం లేకుండా పింఛన్ల పంపిణీ జరగడం లేదు.

కోతలు పెడుతున్నారిలా..

మరోవైపు వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల పింఛన్లకు రకరకాల సాకులతో కోత పెట్టేస్తూ, పింఛన్‌దారుల సంఖ్యను తగ్గించుకునేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. టీడీపీకి అనుకూలంగా లేరనే కారణంతో, కూటమికి ఓటు వేయలేదనే అనుమానాలతో కొందరి నేతల సహాయంతో అటువంటి వారి పేర్లు తప్పించాలని భావిస్తోంది. స్థానిక జాబితాను రహస్యంగా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటువంటి కారణాలతోనే ఈ రెండు నెలల్లో కొంత మంది లబ్ధిదారులను తప్పించారనే ఆరోపణలు వస్తున్నాయి. మళ్లీ సదరం పరీశీలన చేస్తూ, కొంత పింఛన్లను కోత పెట్టేందుకు చర్యలు చేపట్టింది. ఇక రేషన్ కార్డులనూ కోత పెట్టేందుకు ఈకేవైసీ చేపడుతోంది. దీంతోపాటు కొత్త కార్డులు ఇవ్వడంతో పూర్తిగా జాప్యం చేస్తోంది. డిసెంబర్ నుంచి కార్డుల పేరుతో ప్రజలకు ఆశ చూపిస్తోంది. దీంతో జనం తిప్పలు పడుతున్నారు.

చెప్పేదొకటి చేసేదొకటి



రేషన్ కార్డులో చేర్పులకు ఏడాదిగా ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఏ పథకం అందాలన్నా రేషన్‌కార్డు తప్పనిసరి అంటున్నారు. నెల రోజులుగా తిరుగుతున్నా. పనులు వదిలేసి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రస్తుత పాలకులు చెప్పేదొకటి, క్షేత్రస్థాయిలో జరిగేది మరొకటి. గతంలో ఇలా ఎప్పుడూ లేదు.

–మోహన్, యాదమరి

పింఛన్ కోసం ఎదురుచూపులు



నాకు గతంలో జరిగిన ప్రమాదంతో నడవడం కష్టంగా మారింది. వైద్యులు పరిశీలించి దివ్యాంగ పింఛన్‌కు అర్హత ఉందన్నారు. ప్రభుత్వం పింఛన్ ఇస్తే ఆ డబ్బులు ఆసరాగా ఉంటుందని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. ఎప్పుడు సచివాలయానికి వెళ్లిన వెబ్‌సైట్ పనిచేయడం లేదంటున్నారు. కొత్త పింఛన్ ఎప్పుడు ఇస్తారో ఏమో తెలియలేదు.

–కుమార్, చవటపల్లె

రేషన్‌కార్డుకు చుక్కలు



కొత్త రేషన్ కార్డు తీసుకోవాలంటే పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. రేషన్‌కార్డు ఉంటే సంక్షేమ పథకాలు, భవిష్యత్‌లో పిల్లల చదువుకు ప్రభుత్వ పథకాలు వస్తాయని చెబుతున్నారు. కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయానికి వెళితే సర్వర్ పనిచేయడం లేదంటున్నారు. వారం రోజులుగా తిరుగుతున్నా ఇంతవరకు ప్రయోజనం లేదు.

–అన్వర్, సంతపేట

కార్డులు సకాలంలో అందేనా?



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదికావస్తున్న రేషన్ కార్డులు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సచివాలయంలో సర్వర్ మొరాయించడంతో రోజూ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయవలసిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో వలంటీర్లు ఇంటికి వచ్చి కార్డు అందజేసేవారు. కానీ ఈ ప్రభుత్వంలో ఆ ఆ పరిస్థితి లేదు.

–గోపి, ఐరాల

తూకాల్లో తేడా రాకుండా చూసుకోండి


మాట్లాడుతున్న తహసీల్దార్ జయంతి

గుడిపాల: తూకాల్లో తేడాలు రాకుండా చూసుకోవాలని తహసీల్దార్ జయంతి తెలిపారు. రేషన్ డీలర్లకు సంబంధించి గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఈ–పాస్ మిషన్, వేయింగ్ స్కేలును వెరిఫికేషన్ చేశారు. వీటిని లీగల్ మెట్రాలజీ, విజన్‌టెక్ వాళ్లు పరిశీలించారు. డీలర్లకు సంబంధించి వేయింగ్ స్కేల్‌లో తేడాలు ఉన్నట్లయితే సరి చూసుకోవాలన్నారు. ఈ–పాస్ మిషన్‌లో లోటుపాట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆమె వారికి సూచించారు. జూన్ 1న అన్నీ సిద్ధంగా ఉంచుకొని రేషన్ కార్డు లబ్ధిదారులకు సకాలంలో నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలన్నారు.

మహాభారతం ప్రారంభం

యాదమరి: మండల పరిధిలోని చెన్నారెడ్డిపల్లిలో శ్రీ ద్రౌపది సమేత ధర్మరాజుల వారి దేవస్థానంలో 43వ మహాభారత ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు వేడుకగా ధ్వజారోహణం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ ప్రాంగణంలో హరికథా కాలక్షేపం సాగింది. ఉత్సవాలను జూన్ 15 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మండలి తెలిపింది.

హంసపై ఇంద్రవరదుడి విహారం



యాదమరి: మండల కేంద్రంలో కొలువైన శ్రీ వరదరాజ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి హంసవాహనంపై వరదరాజ స్వామి వారు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అంతకముందు ఉదయం సప్పరం ఉత్సవం, ప్రత్యేక అలంకారభిషేకం నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలను ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నేడు సమావేశం

గుడిపాల: చిత్తూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9:30 గంటలకు మండలంలోని నాయకులు, కార్యకర్తలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు ప్రకాష్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చినందున వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వెన్నుపోటు దినంగా పరిగణిస్తూ చేపట్టాల్సిన కార్యక్రమంపై సమావేశం ఉంటుందన్నారు. దీనికి ముఖ్య అతిథిగా చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు.

దశల వారీ మామిడి కోతలతో ప్రయోజనం


కేజీ సత్రం వద్ద మామిడి రైతులకు పంట కోతలపై అవగాహన కల్పిస్తున్న సాగరిక

బంగారుపాళెం: తోటల్లో రైతులు దశలవారీగా పంట కోత చేపడితే అధిక ధరలు పొందే అవకాశం ఉందని మండల ఉద్యానశాఖ అధికారి సాగరిక అన్నారు. మండలంలోని కేజీ సత్రం గ్రామంలో గురువారం మామిడితోటల్లో కాయలు కోతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, తోటల్లో రైతులు ఒకే సాగి మామిడి కాయలు కోయకుండా దఫదఫాలుగా కోతలు చేపట్టడం వల్ల ఆశించిన ధరలు వచ్చే అవకాశం ఉందన్నారు. మామిడికి పండు ఈగ పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పండుఈగ నివారణకు రాయితీపై బుట్టలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హార్టికల్చర్ సహాయకులు ఎగువ మూర్తి, రైతులు పాల్గొన్నారు.

వేసవి శిబిరంతో విజ్ఞానం


శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ రాజశేఖర్

ఐరాల: చిన్నారుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవి విజ్ఞాన శిబిరం ఎంతగానో దోహదపడుతుందని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు బొమ్మలు తయారు చేయడం, గేయడం, కథలు చెప్పించడం, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలకు విద్యార్థులు హాజరై విజ్ఞానవంతులు కావాలని సూచించారు. విద్యార్థులకు సెలవులు ఇచ్చిన దృష్ట్యా సమయం సమయం వృథా కాకుండా ఉండేందుకు గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు శివాలయం హుండీ లెక్కింపు

బంగారుపాళెం: మండలంలోని మొగిలిశివాలయంలో శుక్రవారం హుండీల లెక్కింపు చేపట్టనున్నట్లు ఈఓ మునిరాజ తెలిపారు. ఆలయం ఆవరణలో ఉదయం 10 గంటలకు దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణతో హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఆయన తెలిపారు.

బస్సులన్నీ మహానాడుకు.. ఇక్కట్లు ప్రయాణికులకు



వారపు సంత వద్ద బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు, మహానాడు సభకు వెళుతున్న ఆర్టీసీ బస్సు

ఐరాల: కడప జిల్లాలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడుకు ఆర్టీసీ బస్సులు తరలివెళ్లడంతో మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో వారపుసంత, బజారువీధిలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మండల కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన గంగజాతర సందర్భంగా బెంగళూరు, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో ప్రజలు చుట్టు పక్కల గ్రామాల బంధువుల ఇళ్లకు వచ్చారు. గురువారం తిరిగి వెళ్లడానికి బస్టాండుకు వెళ్లిన ప్రయాణికులకు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో నరకయాతన అనుభవించారు. గంటల తరబడి వందలాది మంది ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండాల్సి వచ్చింది. రెండు గంటలైనా ఒక్క బస్సు కూడా రాలేదని వాపోయారు. కొందరు అధిక చార్జీలు వెచ్చించి ప్రైవేట్ వాహనాల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు.

అంతర్రాష్ట్ర సరిహద్దులో సీసీ కెమెరాల ఏర్పాటు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

యాదమరి: మండల పరిధిలోని అంతర్రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో అక్రమ రవాణా నివారణ నిమిత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని స్థానిక ఎస్‌ఐ ఈశ్వర్ తెలిపారు. ఆయన గురువారం సరిహద్దు గ్రామాల ప్రజలతో మాట్లాడారు. కనికాపురం, కొట్టాలం మార్గాల నుంచి తమిళనాడుకు అక్రమ రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. దీన్ని కట్టడి చేయడానికి అత్యాధునిక సాంకేతిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

నింగికెగసిన నంగమంగళం కీర్తి


నంగమంగళం గ్రామం

- అందరూ విద్యావంతులే, ఉద్యోగులే
- 150 కుటుంబాలుంటే నగం మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు
- 75 ఏళ్ల ముందు నుంచే ఉపాధ్యాయ వృత్తిలోకి

గుడిపాల: భావిభారత నిర్మాతలైన గురువులకు నిలయంగా మారింది నంగమంగళం. మండలంలోని నంగమంగళంలో వందశాతం విద్యావంతులు, ఉద్యోగస్తులే కావడం గమనార్హం. అందులోనూ గురుతరమైన బాధ్యతగల ఉపాధ్యాయవృత్తిని చేపట్టినవారు అధిక సంఖ్యలో ఉన్నారు. 150 కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో దాదాపు 75 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులే. నిన్న మొన్నటి తరంవారు ఉపాధ్యాయ వృత్తినే ఎంచుకోగా, నేటితరం యువకులు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగాను, సైన్యంలోనూ, విదేశాల్లోను నంగమంగళం కీర్తి జెండాను ఎగురవేస్తున్నారు. ఒకప్పటి వెనుకబడిన ప్రాంతంగా పేరున్న నంగమంగళం సమీపంలోని బొమ్మసముద్రంలో 1912లో జన్మించిన కొండా మునిరెడ్డి(కె.ఎం.రెడ్డి) ఈ ప్రాంత విద్యాభివద్ధికి విశేష కృషి చేశారు. ఈయన తమిళనాడు రాష్ట్రం వేలూరులోని వూరీస్ పాఠశాలలో కొద్దిరోజులు చదువుకొని తరువాత కలకత్తాలోని శాంతినికేతన్‌లో విద్యనభ్యసించి, రవీంద్రనాథ్ ఠాగూర్ శిష్యుడిగా చేరారు. అనంతరం కె.ఎం.రెడ్డి బొమ్మసముద్రం ఉన్నత పాఠశాలను స్థాపించి ఎందరికో ఉపాధ్యాయవృత్తిపై ఆసక్తిని కలిగించారు. చుట్టు పక్కల గ్రామాల్లో పర్యటించి యువకులను అంతా చదివించి చైతన్యవంతులను చేసేలా చర్యలు చేపట్టారు. దీంతో నంగమంగళం గ్రామంలో 1950వ సంవత్సరం నుంచే ఉపాధ్యాయ వృత్తి మొదలైంది. అయితే ఇందులో ప్రస్తుతం 60 మంది దాకా విశ్రాంతి ఉపాధ్యాయులు ఉండగా మరో 20 మంది ప్రస్తుతం విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. కె.ఎం.రెడ్డి వల్లే మా నంగమంగళంగ్రామం యావత్తు ప్రయాణించి గురువుల నిలయంగా మారిందన్నారు.

నేడు ఇంజినీర్లుగా..

ఉపాధ్యాయులుగా పనిచేసి, వారి పిల్లలను నేడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా తీర్చిదిద్దిన ఘనత కూడా వారిదే. ఉపాధ్యాయ వృత్తిలో ఏ విధంగా ఉన్నారో ప్రస్తుతం ఇంజినీర్లుగాను అదేవిధంగా రాణిస్తున్నారు. ఈ గ్రామంలో 60 మంది వరకు అన్ని విభాగాల ఇంజినీర్లు ఉన్నారు. ఇందులో 30 మందికి పైగా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రతి ఇంటికి ఒకరు లేదా ఇద్దరు తప్పనిసరిగా ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంతే గాక 25 మంది వరకు భారత సైన్యంలో చేసి సేవలందిస్తున్నారు. ప్రస్తుతం ఈ గ్రామంలో చదువుకోనివారంటూ ఎవరూ లేరు.

అభివృద్ధిలోనూ అంతే...

ఈ గ్రామంలో పూరి గుడిసె ఒక్కటంటే ఒక్కటి కనపడదు అలాగే అన్ని వీధులకు సిమెంట్ రోడ్లు ఉన్నాయి. గ్రామం ఆనుకొనే రైల్వేస్టేషన్ కూడా ఉంది. ఇంతేగాక భారతీయ స్టేట్ బ్యాంక్, సింగిల్ విండో, పోస్టాఫీసు కూడా అందుబాటులోనే ఉన్నాయి.

మహానుభావుడు కె.ఎం.రెడ్డి



మా ప్రాంతంలో ఇంతమంది ఉపాధ్యాయులు ఉన్నారంటే అందుకే కేఎం రెడ్డే కారణం. ఆయన చూపిన బాటలో నడిచాం. అందరు ఉపాధ్యాయులుగా సేవలందించాం. నేడు చుట్టుపక్కల గ్రామాలకు వెళితే మా స్టూడెంట్స్ నమస్కరిస్తుంటారు. ఎంతో సంతోషమేస్తుంది. అప్పుడు కూడా ఆ మహానుభావుడు కె.ఎం.రెడ్డి గుర్తుకొస్తారు

–సుబ్రమణ్యంరెడ్డి, రిటైర్డ్ టీచర్

అన్నింట్లోనూ ముందంజ



కె.ఎం రెడ్డి వల్లనే మా గ్రామంలో అందరూ ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చారు. ఈ రోజు నంగమంగళం ప్రాంతం అన్ని అంశాల్లో ముందంజలో ఉందంటే ఆయనే కారణం. రిటైర్డ్ టీచర్లు మా ఊరి బడిలో పిల్లలకు బోధిస్తున్నారు. పిల్లలు కెఎం రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలన్నదే మా ఆకాంక్ష.

–రాజశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్



నంగమంగళంలో ఏర్పాటు చేసిన భారతీయ స్టేట్‌బ్యాంక్, కేఎం రెడ్డి ప్రభుత్వ పాఠశాల


కేఎం రెడ్డి సమాధి

సిందూర్ విజయోత్సవ ర్యాలీ



గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మహిళలు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీని పలు మహిళ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు గురువారం సాయంత్రం స్థానిక గాంధీ విగ్రహం వద్ద నుంచి నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్లారు. కశ్మీర్‌లో మహిళలకు జరిగిన అన్యాయానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ సరైన సమాధానం ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అనురాధ, లక్ష్మీప్రసన్న, సుకన్య, సుందరి, లీల, దీప, హేమలత, వీరికి సంఘీభావంగా బీజేపీ నాయకులు చిట్టిబాబు, రామభద్ర పాల్గొన్నారు.